క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలి



వైద్య సిబ్బందితో డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందరికీ వైద్య సేవలు అందాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెమడూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కల్పించాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్నం ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగుల ఇళ్లను సందర్శించి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలని సూచించారు. డ్రైడే–ఫ్రైడే కార్యక్రమం తప్పకుండా పాటించాలన్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవ పూజలు

సి.బెళగల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాల్మీకి రామాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ పూజలను వేద పండితులు గురువారం ప్రారంభించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు ఆలయంలో కర్నూలు టౌన్ పురోహితులు శ్రీ ములుకుంట్ల ఆంజనేయ శర్మ పండిత బృంద సభ్యులు గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అదేవిధంగా పుణ్యాహవాచనం, మాతృకాపూజ, రక్షాబంధనం, మహాయాగ మంటప ప్రవేశం షోడశస్తంభ పూజలు, కలశ స్థాపనతో దేవతల ఆవాహనం, మూల మంత్ర జపములు చేపట్టారు. సాయంత్రం అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమం మంగళ హారతితో ప్రసాద వినియోగం నిర్వహించారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం గడిగరేవుల గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు.అనంతరం రైతులతో ఏఓ మాట్లాడుతూ పంటల నమోదుకు రైతులు అప్లికేషన్ ఫాంతో పాటు ఆధార్‌కార్డు, 1బీ, బ్యాంక్ అకౌంట్ బుక్కును వ్యవసాయ సిబ్బందికి అందజేయాలన్నారు. పంటల నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే ప్రతి పథకం లబ్ధిపొందవచ్చన్నారు. రైతులందరు సెప్టెంబర్ 15 వ తేదీ లోపు రైతులు పంటల నమోదు చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 159 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు గురువారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం లో 0.813 టీఎంసీలనిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైయ్యాయి. గురువారం హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్‌జీఎం కళాశాల బస్సు కర్నూలు నుంచి కళాశాలకు వస్తుంది. ఫార్మసీ కళాశాల వద్ద ఉన్న యూటర్ చేసుకుంటున్న తరుణంలో నంద్యాల నుంచి తమ్మరాజుపల్లెకు వెళ్తున్న ఏపీ26టీటీ9604నంబర్ టిప్పర్ వేగంగా వచ్చి బస్సును ఢీకొంది. బస్సు డోర్ వద్ద సిగ్నల్ ఇస్తున్న క్లీనర్ ఉస్మాన్ టిప్పర్ బస్సుల మధ్య నలిగిపోయాడు. ఈ ఘటనలో ఉస్మాన్‌కు కాలు, చెయ్యి విరిగిపోయాయి. అలాగే తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. దీంతో కాసేపు ట్రాఫిక్ అయ్యింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలం చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు.

ఆరోగ్యశ్రీ కార్డుతో కీళ్ల మార్పిడి

పాణ్యం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కీళ్లమార్పిడి ఆపరేషన్‌లు చేస్తున్నట్లు కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రి ఆర్థో డాక్టర్ మంజునాథ్ తెలిపారు. పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగాల శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎములకు సంబధించి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం రోగుకలు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆటోమాబు, ఉసేన్‌సా, చందమామ బాబు, రమణయ్య, ఈఓ అనురాధ, మహేశ్వర‌రెడ్డి,నీలారెడ్డి, హుసేన్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. గురువారం కల్లూరు అర్బన్ 28వ వార్డులోని లక్ష్మీపురం గ్రామంలో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు అధికారులను ఆదేశించారు. అర్హత ఉండికూడా సంక్షేమ పథకాలు అందని అర్హులు ఉంటే తమ దృష్టికి తేవాలని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు ప్రభుత్వ పథకాలు వర్తించాయా... లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని వివరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, గ్రామ నాయకులు సత్యంరెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి కోసం రూ. 19.8 కోట్లు ఖర్చు

కర్నూలు నగరంతోపాటు విలీన గ్రామాల్లోను అదే స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య తెలిపారు. నగర పాలక సంస్థలో పాలన వర్గం ఏర్పడ్డాక విలీన గ్రామాల అభివృద్ధికి దాదాపు రూ. 19.8 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఆ భయంతోనే చంద్రబాబు, దత్తత పుత్రుడు, సొంతపుత్రుడు తాలా ఒక ప్రాంతంలో పర్యటిస్తూ ఉనికిని కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారని ఆరోపించారు. చివరకు శాంతిభద్రతకు విఘాతం కలిగించేలా రెచ్చొగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని, ప్రజల తిరుగుబాటు చవిచూస్తారని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

కల్లూరు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యమైన పంట దిగుబడులు పొందవచ్చునని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం లక్ష్మీపురం రైతు భరోసా కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు రూ.10 వేలు విలువ చేసే మెటీరియల్, 23 రకాల విత్తనాల కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండి రైతులకు నికర ఆదాయం లభిస్తుందన్నారు. దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, ఏఓ శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పాణ్యం: దూర విద్య విధానంలో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్ గురువారం తెలిపారు. పదో తరగతి పాసై ఆర్థిక స్తోమత, ఇతర కారణాల వల్ల రెగ్యులర్‌గా ఇంటర్ చదవలేని విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు తమ కళాశాలల్లో సంప్రదించి అడ్మిషన్లు పొందాలన్నారు.

కొండను తవ్వి ఎలుకను పట్టారు

- రూ.10 కోట్ల ఉపాధి పనుల్లో రూ.1,90,431 నిధుల పక్కదారి
- ఉపాధి పనుల కొలతల్లో తేడాలపై పీడీ ఆగ్రహం



ఉపాధి పనులపై బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు కోడుమూరు మండలంలో రూ.10,20,21,734 నిధులతో 583 పనులు చేయగా కొలతలు, హాజరు సరిగా లేని కారణంగా రూ.1,90,431 పక్కదారి పట్టినట్లు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు లెక్కతేల్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్‌టీఎం లోకేశ్వరరెడ్డి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మండలంలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు సమర్పించిన నివేదికలను పరిశీలించి, పనులను సక్రమంగా నిర్వహించని, నిధులు పక్కదారి పట్టించిన సిబ్బందికి జరిమానా విధించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల్లో సిబ్బంది కుమ్మక్కై బినామీ పేర్ల మీద పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నా అవేవి కూడా సోషల్ ఆడిట్‌లో బయటపడకపోవడం శోచనీయం. ఒక్క గోరంట్ల గ్రామంలో జరిగిన వాటర్‌షెడ్ పనుల కొలతల్లో భారీగా తేడాలుండడంతో పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిధులు రూ.1,24,113 రికవరీకి ఆదేశించడంతో పాటు, వారం రోజుల్లో కొలతల్లో తేడాలున్న వాటర్‌షెడ్ పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఏపీడీ పద్మావతి, ఏపీఓ రమాదేవి, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందించాలి

పాణ్యం: ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు చేపట్టిన సంగ్రామ్ బైక్ యాత్ర రెండవ రోజు గురువారం పాణ్యంలో సాగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ప్రతాప్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, సతీష్, సుభాన్, చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

29న బాస్కెట్‌బాల్ పోటీలు

పాణ్యం: జాతీయ హాకీ క్రీడాకారుడు దివంగత ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈనెల 29న పురుషులకు సంబధించి బాస్కెట్‌బాల్ పోటీలు పోటీలు నిర్వహిస్తున్నామని ఆర్‌జీఎం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు అర్హులని, వయసు 17–25 మధ్యలో ఉండాలన్నారు. క్రీడాకారులు ఆయా కళాశాల గుర్తింపు సర్టిఫికెట్లతోపాటు ప్రిన్సిపాల్స్‌తో బోనఫైడ్ సర్టిఫికె ట్లు తప్పనిసరిగా తీసుకురావాలని, ఉదయం 8 గంటలకు కళాశాల చేరుకోవాలని సూచించారు. శ్రీ దాకారులకు అన్ని రకాల వసతి కల్పిస్తున్నామన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

గూడూరు రూరల్: గ్రామాల్లో ఓటరు జాబితాకు సంబంధించి బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. జూలకల్‌లో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు తొలగించేందుకు, పేరు, అడ్రస్‌లో మార్పులు, చేర్పులు చేసేందుకు, కొత్త ఓటరు నమోదుకు ఇంటింటి సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా సరి చేసేందుకు సర్వే చేపట్టామని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

గడివేముల: జగనన్న లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వలంటీర్లు, లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో డీఈ మాట్లాడారు. గడివేములలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 271 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మూర్తి, హౌసింగ్ ఏఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఏఓ తనిఖీలు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం ఏఓ రవి ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణదారులు స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పక్కాగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అనుమతి లేని ఉత్పత్తులను కలిగిఉంటే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు కొన్న ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని,విత్తనాలకు సంబంధించిన బిల్లులను పంట దిగుబడులు పొందే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌ఎస్‌యూ చేయుతతో నీటి సౌకర్యం



సి.బెళగల్ బీసీ హాస్టల్ విద్యార్థులకు సాయం అందిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

సి.బెళగల్: స్థానిక బీసీ హాస్టల్‌లో మంచి నీటి వసతి కల్పించేందుకు వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ చేయూత అందించింది. బుధవారం రాత్రి ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు హాస్టల్ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు రాత్రి హాస్టల్‌కు చేరుకున్న యునియన్ సభ్యులు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు, సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఆరా తీయగా హాస్టల్‌లో అందరికీ సరిపడేలా నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యను రెడ్డిపోగు ప్రశాంత్ వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర నాయకుడు కరణం నవీన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో హాస్టల్‌లో అదనపు ట్యాంక్ ఏర్పాటుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో గురువారం యూనియన్ నాయకులు, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజవర్గ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి యువసేన సభ్యులు నగదును అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి ముందరింటి వెంకటేష్, వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు నబిరసూల్, గణేష్, కార్యదర్శి మల్లికార్జున, సభ్యులు సిద్ధు, ఇసూబ్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు



గుండ్రేవులలో వైఎస్సార్ పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి పంట సాగులో సేంద్రియ ఎరువులను ఉపయోగించి మెలకువలను పాటిస్తే అధిక లాభాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలం పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో గ్యాప్ (జీఏపీ – గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి పొలాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్ఎఫ్) పద్ధతులను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంతో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంటల సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. ఏఈఓ సిద్ధు, ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, వీఏఏ నాయక్, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

కన్వీనర్ల భద్రత.. ప్రభుత్వ బాధ్యత

ఓర్వకల్లు: గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న కన్వీనర్లు, గృహసారథుల భద్రతకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం సంతోషకరమని మండల కన్వీనర్ లోటర్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం గ్రామ సచివాలయంలో కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లోటర్‌బాషా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే కన్వీనర్లు, గృహసారథులను నియమించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వీరందరి భద్రతా సౌలభ్యం కోసం ప్రభుత్వం ఉచిత బీమా పథకాన్ని అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం హుసేనాపురం–1, 2 సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులచేత బీమా పథకానికి రిజిస్ట్రేషన్లు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- నందనపల్లెలో రూ.40 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ



నందనపల్లెలో కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ కాల్వ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.300 కోట్లతో కోడుమూరు నియోజకవర్గంలో మనబడి నాడు – నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, గ్రామ సచివాలయ నిర్మాణం, రైతు భరోసా, అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. గత 40 ఏళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. త్వరలో రూ.11.85 కోట్లతో పడిదెంపాడు– పూడూరు రోడ్డు, రేమట, కోడుమూరు, గూడూరు మండలాల్లో రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తవుతాయని, ఆ తర్వాత రోడ్ల నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. పుల్లారెడ్డి కాలేజీ నుంచి సూదిరెడ్డిపల్లె మీదుగా నందికొట్కూరు రోడ్డు వరకు రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. జిల్లా విజిలెన్స్అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ–2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ కె మాధురి, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటేశ్వర్లు, అనిల్‌బాషా, సురేష్, శేషిరెడ్డి, వాసు, విద్యాసాగర్, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన వ్యవహారంపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ విద్యాసాగర్ ఉన్నారు.

చెరువునే మింగేస్తారా?



గార్గేయపురం చెరువు రికార్డులను పరిశీలిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- గార్గేయపురం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్
- అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గార్గేయపురం చెరువును టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కబ్జా చేయడం దారుణమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే చెరువునే మింగేస్తారా అని అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని గార్గేయపురం చెరువును జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ విద్యాసాగర్, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, మాజీ సర్పంచ్ ఏసేపు, సచివాలయ కన్వీనర్ సురేష్, మత్స్యకారులతో కలిసి ఎమ్మెల్యే కబ్జాకు గురైన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం చెరువు..... నందనపల్లె, మిలిటరీ కాలనీ, పడిదెంపాడు, పూడూరు, గార్గేయపురం ప్రజల దాహార్తి తీర్చడంతో పాటు రైతులు పంటలు పండించుకునేందుకు సాగునీరు కూడా వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. చెరువును అక్రమంగా కబ్జా చేసి వందల టిప్పర్లతో ఎర్రమట్టితో చెరువులో నింపి ఆక్రమించారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి గార్గేయపురంలో చెరువు ఆక్రమణకు గురి కాకుండా కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని కోరారు. కోడుమూరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను, స్థలాలను, చెరువును సైతం వదలకుండా టీడీఈప నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి బినామీ బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి, జులకల్ గ్రామానికి చెందిన టీడీపీ నేత సుధాకర్‌రెడ్డి గూడూరు మండలంలో ఉన్న భూములను గ్రీన్ కో కంపెనీకి భూములు సేకరించి అమ్మడం నిజం కాదా అని ప్రశ్నించారు. తులశాపురంలో 99 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములను ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి కబ్జా చేశారని, ఎదురూరు గ్రామంలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన 74 ఎకరాల భూములను తన స్వాధీనం పెట్టుకుని 40 సంవత్సరాల నుంచి సిస్తు చెల్లించకుండా వేలం వేయకుండా దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తులశాపురం గ్రామంలో 25 ఎకరాలు డి పట్టాలు తాత్కాలిక అగ్రిమెంట్ చేయించుకుని టీడీపీకి చెందిన మహేశ్వర్‌రెడ్డి పేరొకరి రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ శాఖ భూములను వేలం వేయించి ప్రభుత్వానికి లాభం చేకూర్చామని గుర్తు చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారని కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ ఏసేపు, సచివాలయ కన్వీనర్ సురేష్ ఆరోపించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



సి.బెళగల్ కొటారుమిట్ట స్కూల్లో విద్యా విధానాలను తెలియజేస్తున్న ఎంఈఓ ఆదాంబాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విధులపట్ల అంకిత భావంతో పనిచేసి, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ ఆదాంబాష సూచించారు. గురువారం ఆయన సి.బెళగల్‌లోని కొటారుమిట్ట ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి పాఠశాల నిర్వహణపై సూచనలు చేశారు. విద్యార్థులచే పాఠ్యాంశాలు చదివించి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని హెచ్ఎం హనుమన్నను ఆదేశించారు. ఉపాధ్యాయులు మీనాక్షి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కోడుమూరు రూరల్: కోడుమూరులో రూ.34 లక్షలతో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. స్థానిక షాదీఖానాలో గ్రంథాలయాధికారి అశోక్ ఆధ్వర్యంలో గురువారం 'గ్రంథాలయాల అభివృద్ధి– ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై ప్రజాప్రతినిధులు, ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కోడుమూరులో గ్రంథాలయం ఉన్న స్థలాన్ని తమ శాఖకు కేటాయిస్తే కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. త్వరలో భవన నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆంధ్రయ్య, రాముడు, కృష్ణయ్య, షాకీర్‌బాషా, లైబ్రేరియన్లు గోవిందరెడ్డి, మధునాయుడు తదితరులున్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు



ఈ తాండ్రపాడులో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు (న్యూటౌన్): పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దానమ్మ, జయరాముడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ గ్రామంలో ఓ వ్యక్తి మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బైనేని చంద్ర (41) గ్రామంలో గడేకారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మిద్దెపై రెండవ అంతస్తులో రేకుల షెడ్డు వేసుకొని నివాసముంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పనులు ముగించుకొని ఇంటిపైకి మెట్లు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని మృతుని భార్య దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు, నలుగురు కుమార్తెలు సంతానం ఉన్నారు.